క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



పెద్దకొత్తపల్లి: ముష్టిపల్లి గ్రామానికి చెందిన తల్దారి రాముడు, తర్వారి చెన్నమ్మల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 వేలను ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, తిరుతపయ్య, కురుమయ్య, నరసింహ, అశోక్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన కార్పొకుల వరుణ్‌కుమార్ బోన్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆదివారం మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ సభ్యులు ఆకుతోట నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని పుల్లగిరి గ్రామ పంచాయతీ బండమీది తండాకు చెందిన గమ్లి శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామస్తుడు గోవింద్‌నాయక్ ఆమె అంత్యక్రియల కోసం రూ.5 వేల నగదును ఆదివారం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

వెల్దండ: మండల కేంద్రంలోని యెన్నమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీజను ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌కుమార్, సంజీవ్ కుమార్, ఎర్ర శ్రీనుముదిరాజ్, తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీపీకి ఘన నివాళి



వెల్దండ: మాజీ ఎంపీపీ జోత్యనాయక్ వర్ధంతి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, ఎంపీటీసీ చిట్టి కాదురామ్‌నాయక్, శేఖర్‌నాయక్, రవీందర్‌నాయక్, మాజీ సర్పంచ్ పంతువరల క్ష్మీనాయక్, తానేష్‌యాదవ్, గన్యనాయక్, అరుణ్‌తేజ, సుధీర్‌నాయక్, పుల్లయ్య, శ్రీనివాస్‌యాదవ్, మహేష్‌యాదవ్ ఉన్నారు.

అన్నదాన సత్రానికి విరాళం



మన్ననూర్: శ్రీశైలం పుణ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న తెలంగాణ ఆర్యవైశ్య అన్నదానం సత్రానికి రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ టూరిజం చైర్మన్ జూలూరు సత్యనారాయణ ఆదివారం రూ. 25 వేల విరాళం అందజేశారు. మిడిదొడ్డి శ్యాం సుందర్‌కు చెక్కు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు వెంకటరమణ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణ కేంద్రంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడూరు మండల కేంద్రానికి చెందిన పద్మ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతిచెందిందని ఆరోపించారు. యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. సత్యం, నవీన్ పాల్గొన్నారు.

పశువుల మృత్యువాత

చిన్నంబావి: మండలంలోని అయ్యవారిపల్లిలో విషపు మొక్కలు తిని పశువులు మృత్యువాత పడ్డాయి. వివరాల్లోకి వెళ్తే మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన సుంకన్న, మేకల మద్దిలేటి, జమ్ములయ్య, కృష్ణయ్యలకు చెందిన నాలుగు బర్రెలు, ఒక ఆవు గ్రామ సమీపంలో ఉన్న పొలాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటను మేశాయి. అప్పుడు మొలిచిన లేత మొక్కలు కావడంతో అది విషంగా మారి 5 పశువులు పశువులు మృత్యువాత పడ్డాయని, పది పశువులకు చికిత్స అందించామని పశువైద్యాధికారి గంగరాజు తెలిపారు. ఈ వర్షాలకు పంట పొలాల్లో మొలకెత్తిన మొక్కజొన్న పంటను పశువులు తినడం వల్ల అది విషంగా మారుతుందని రైతులు జాగ్రత్త పడాలని సూచించారు. బాధిత రైతు కుటుంబాలను ఆదుకోవాలని గ్రామస్తులు శేఖర్, తిరుపతయ్య, రామస్వామి తదితరులు కోరారు.



కల్వకుర్తిలో



లింగాలలో



మన్ననూరులో



వెల్దండ తహసీల్దార్ కార్యాలయంలో



పెద్దకొత్తపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో..

ఊరూరా సంబరాలు

- ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. దశాబ్ది వేడుకలను పురస్కరించుకొని నాగర్‌కర్నూల్ పట్టణంలో జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో జెడ్పీ చైర్ పర్సన్ బి శాంత కుమారి, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట, పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. జెడ్పీటీసీ శ్రీశైలం, జెడ్పీ సీఈఓ దైవసహాయం, డిప్యూటీ సీఈఓ గోపాల్‌నాయక్, రవీందర్ హాజరయ్యారు.

నాగర్‌కర్నూల్: జిల్లా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగస్తుల సంఘం భవనంలో ప్రొఫెసర్ జయశంకర్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. జిల్లా అధ్యక్షుడు జే రామచంద్ర రెడ్డి ,ప్రధాన కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి వెంకటశెట్టి, ఉద్యమకారుడు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, మండల కార్యదర్శి యుగంధర్ రెడ్డి, వార్డెన్ చెన్నయ్య, కృష్ణయ్య, నిజాముద్దీన్, పాండు, పాండురంగయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవంలో భాగంగా పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అంబేడ్కర్ విగ్రహానికి, తెలంగాణ తల్లి విగ్రహాలకు, అమరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అచ్చంపేట: అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టరు చిక్కుడు వంశీకృష్ణ జాతీయ జెండా ఎగురవేశారు. జై తెలంగాణ అని నినాదాలు చేశారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. ఉద్యమకారులను సన్మానించి మోమెంటోలు అందజేశారు.

కల్వకుర్తి టౌన్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి జాతీయజెండాను ఎగురవేశారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. తెలంగాణ తల్లి, అమరవీరుల స్థూపానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్ సత్యం జాతీయజెండాను ఆవిష్కరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, నాయకులు, ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.



పెంట్లవెల్లి మండలం మంచాలకట్టలో



తాడూరులో..



బిజినేపల్లి పాలెం గ్రామ పంచాయతీలో



కొల్లాపూర్‌లోని ఆర్డీఓ కార్యాలయం ..



కోడేరు తహసీల్దార్ కార్యాలయంలో

కొల్లాపూర్: ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో సంబంధిత శాఖల అధికారులు జాతీయ జెండాలను ఎగురవేశారు. కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయం, బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయా పార్టీల నాయకులు హాజరయ్యారు. తెలంగాణ తల్లి, ఐలమ్మ విగ్రహాలకు, అమరవీరుల స్థూపాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అమరువీరుల త్యాగాలను స్మరించుకున్నారు.

లింగాల: మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారులు జాతీయజెండాను ఎగురవేశారు. ఎంపీపీ లింగమ్మ, వైస్ ఎంపీపీ నారాయణగౌడు, ఎంపీడీఓ ఆంజనేయులు, ఎస్‌ఐ జగన్మోహన్, సింగిల్ విండో చైర్మన్ హన్మంత్ రెడ్డి, నారాయణగౌడ్, వెంకటయ్య, లక్ష్మణ్‌నాయక్, ఇందిరమ్మ, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

బల్మూర్: మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ తహసీల్దార్ శైలేంద్రకుమార్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అరుణ, పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ రేణయ్య, ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ లక్ష్మి, సింగిల్‌విండో కార్యాలయంలో చైర్మన్ నర్సయ్య, గ్రామ పంచాయతీ వద్ద ఎంపీడీఓ భాస్కర్‌లు జాతీయ జెండాలను ఎగురవేశారు. అమరవీరులకు నివాళులర్పించారు.

ఊర్కొండ: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎంపీపీ రాధా జంగయ్య జాతీయ జెండాఎగరవేశారు. ఎంపీటీసీలు కల్మిచర్ల గోపాల్ గుప్తా, లావణ్య అమరేష్ రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు ఖలీం పాషా, కొమ్ము రాజయ్య, మ్యాకల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మన్ననూర్: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం, గిరిజన ఉన్నత పాఠశాల ఆవరణలో జెండా వందనం చేశారు. హెచ్ఎం పర్వతాలు, ఉపాధ్యాయులు సూర్య, మోతీలాల్, చంద్రకళ గ్రామస్తులు మేరాజ్, బాలస్వామి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేట క్యాంపు కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే డాక్టరు చిక్కుడు వంశీకృష్ణ

వెల్దండ: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలపై అధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ రవి, ఎంపీపీ విజయ, తహసీల్దార్ రవికుమార్, ఏఈ సూర్యంనాయక్, ఏఓ మంజుల, వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డిలు హాజరయ్యారు. అనంతరం స్వీట్లను పంచుకున్నారు.

చారకొండ: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నిర్మల విజేందర్ గౌడ్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రమీల, పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రాజశేఖర్, వ్యవసాయ కార్యాలయంలో ఏఓ చిన్న హుస్సేన్, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండాలను ఎగురవేసి మాట్లాడారు. జూపల్లి, చారకొండ, గోకారం, చంద్రాయన్‌పల్లి, సిర్సనగండ్ల గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సోనియాగాంధీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

పెద్దకొత్తపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ సతీష్, గ్రామ పంచాయతీ వద్ద స్పెషల్ ఆఫీసర్ లక్ష్మణ్, సింగిల్‌విండో కార్యాలయం వద్ద చైర్మన్ శ్రీనివాస్, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఈసూప్‌అలీ త్రివర్ణ పతాకాలను ఎగురవేశారు. బస్టాండ్ కూడలిలో సోనియాగాంధీ చిత్రపటానికి జెడ్పీటీసీ మేకల గౌరమ్మ పాలాభిషేకం నిర్వహించారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంతో పాటు మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోల్, గోపులాపురం గ్రామాల్లో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. సోనియాగాంధీ చిత్రపటానికి మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ పాలాభిషేకం చేశారు. మండల కేంద్రంలో తహసీల్దార్ హిమబిందు, నర్సింహ నాయుడు, కోట్ల సురేందర్, రామన్‌గౌడ్, ఎర్రశీను, శేశేంద్రప్రసాద్, కబీర్, సిరిగిరి శంకర్, వంగ భాస్కర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

కోడేరు: తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ జెండాను ఎగురవేశారు. శ్రీకాంత్‌చారి విగ్రహానికి మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్ రావు పూలమాల వేశారు. డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మి, ఆర్ఐ సురేందర్, జంబులయ్య, తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో జాతీయ జెండాను ఎగరవేసి సంబరాలు నిర్వహించారు. తహసీల్దార్ పాండునాయక్, ఎంపీపీ కొమ్ము మధు సింగింల్‌విండో చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఏఓ సందీప్‌కుమార్‌రెడ్డి, ఏపీఎం నిరంజన్ హాజరయ్యారు.

తాడూరు: తహసీల్దార్ ప్రమీల, ఎంపీపీ శ్రీదేవి, సింగిల్‌విండో చైర్మన్ రామచంద్రారెడ్డి, ఏఓ సాయి రమేష్‌కుమార్, ఎస్‌ఐ మహేష్, ఐకేపీ ఏపీఎం శేఖర్ పాల్గొన్నారు.

బిజినేపల్లి: తిమ్మాజిపేట, బిజినేపల్లి మండలాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, హాజరై అమరవీరులకు నివాళులర్పించారు. తహసీల్దార్ జేకే మోహన్, రాములు ఉన్నారు.



కొల్లాపూర్‌లో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



చారకొండలో



నాగర్‌కర్నూల్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్



ఊర్కొండ మండల పరిషత్ కార్యాలయంలో..

బీఆర్‌ఎస్ నాయకుల హర్షం



తిమ్మాజిపేట మండల కేంద్రంలో సంబరాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: ఉమ్మడి మహబూబ్‌నగర్ శాసన మండలి ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్ రెడ్డి ఆదివారం ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తా, కొల్లాపూర్, లింగాల, తిమ్మాజిపేట, వెల్దండలో బాణాసంచా కాల్చి స్వీట్లు తినిపించుకున్నారు. బీఆర్‌ఎస్‌కు అనుగుణంగా నినాదాలు చేశారు. ఎంపీపీ మాలె రజితభాస్కర్‌గౌడ్, లింగాల సింగిల్‌విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటగిరి, విజయ్‌గౌడ్, సత్యం, మధు, వెల్దండ మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్ శేఖర్ ముదిరాజ్, మధుసూదన్‌రెడ్డి, నర్సింహ్మ, భీమయ్యగౌడ్, నిరంజన్, పర్వతాలు, పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు

వెల్దండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 2005–2006వ సంవత్సరానికి చెందిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం ఆకృతి గార్డెన్‌లో కలుసుకున్నారు. ఒకరికొకరు ఉద్యోగ, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సహపంక్తి భోనాలు చేశారు. కార్యక్రమంలో గురువులు, పూర్వ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

వీపనగండ్ల/కొత్తకోట రూరల్: కొత్తకోట పట్టణంలో నిర్వహిస్తున్న వీపనగండ్ల ఎస్సీ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆవుల సైదులు ఇటీవల తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. పాఠశాల ఆవరణలో ఆదివారం కళాశాల ప్రిన్స్‌పాల్‌తో పాటు సహ ఉపాధ్యాయులు సైదులును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ ఎస్సీ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ.. వారు ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఏళ్లుగా గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కచేందుకు నూతన ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. రాష్ట్ర సంఘం బాధ్యతలు అప్పగించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో తమవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దయాకర్, వైస్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, ఉపాధ్యాయులు ఫాతిమా, మాధవి, లలిత, శివకుమారి, జ్యోతిర్మయి, నరేందర్, శేఖర్, ఉపేందర్, అన్వర్, శ్రీనివాసులు, రవి కుమార్, మహేష్, చెన్నయ్యచారి పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకు రుణాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వబ్రాహ్మణులు

తాడూరు: విశ్వబ్రాహ్మణులకు రుణాలు ఇవ్వాలని సంఘం మండల అధ్యక్షుడు వీరాచారి, కృష్ణమాచార్యులు కోరారు. ఆదివారం స్థానిక చెన్నకేశవ ఆలయ ఆవరణలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నారు. ప్రత్యేక తెలంగాణ సాధనలో విశ్వబ్రాహ్మణుల పాత్ర కీలకమైందన్నారు. సమావేశంలో ఆయా గ్రామాల విశ్వబ్రాహ్మణులు మల్లాచారి, భాస్కరాచారి, జంగాచారి, శ్రీనివాసులు, చంద్రమౌళి, ఆంజనేయులు, అనంతరాములు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మూత్రశాలలు ఏర్పాటు చేయాలి

కోడేరు: మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్‌లో మరుగుదొడ్లు, మూత్రశాలలను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. మండలం నుంచి కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, పెద్దకొత్తపల్లి, అచ్చంపేట,హైదరాబాద్‌కు వందల సంఖ్యలో రాకపోకలు కొనసాగిస్తారని పేర్కొన్నారు. బస్టాండ్‌లో మూత్రశాలలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. మూడు నెలల కిందట పనులు ప్రారంభించి వదిలేశారని వివరించారు. అధికారులు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని మరుగుదొడ్లు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సాగుకు సమాయత్తం

- వానాకాలం పంటలకు పొలాలను సిద్ధం చేసే పనుల్లో నిమగ్నం
- విత్తనాల సేకరణపై రైతుల దృష్టి



ఉప్పునుంతల శివారులో గుంటకతో పొలాన్ని చదును చేస్తున్న రైతు

ఉప్పునుంతల: ఈ ఏడాది వానాకాలం పంటల సాగుకు అదును సమయం ఆసన్నమైంది. దీంతో రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటూ సమాయత్తం అవుతున్నారు. అక్కడక్కడ వర్షాలు పడుతుండటంతో పొలాల్లోని గత పంటల వ్యర్థాలను తొలగించడం, ట్రాక్టర్లు, ఎద్దుల అరకలతో పొలాలను దున్నుకోవడం, చదును చేసుకోవడం వంటి పొలం పనులు చేపడుతున్నారు. కొద్దిశాతం మంది రైతులు ఇటీవల కురిసిన వర్షాలకు జొన్న విత్తనాలను వేసుకున్నారు. గతంలో పత్తి పంటను అధిక విస్తీర్ణంలో సాగుచేసే రైతులు మూడేళ్లుగా వాతావరణం అనుకూలించక పత్తి దిగుబడి తగ్గిపోవడంతో పత్తి పంటను తక్కువ విస్తీర్ణంలో సాగుచేయాలనే ఆలోచనలో ఉన్నారు. అక్కడక్కడ మొక్కజొన్న పంటను వేసుకునే దిశగా రైతులు ముందుకు సాగుతున్నారు. కంది పంటను అంతర పంటగా సాగుచేయడంతో పాటు అక్కడక్కడ వేరుగా సాగు చేసే ఆలోచనలో ఉన్నారు. యాసంగిలో వేరుశనగ పంటను సాగుచేసే పొలాల్లో మొక్కజొన్న పంటను వేస్తే బాగుంటుందనే ఆలోచనలో కొంతమంది రైతులు ఉన్నారు. మండల పరిధిలో రెండేళ్లుగా కేఎల్ఐ సాగునీరు వస్తుండటంతో యాసంగి పంటగా వేరుశనగ పంటను అధిక విస్తీర్ణంలో సాగుచేసుకునేలా ముందస్తు ఆలోచనతో వానాకాలం పంటలను సాగు చేయకుండా ఖాళీగా ఉంచుతున్నారు.

సాగుకు అనువైన భూములే అధికం..

మండలంలో వ్యవసాయానికి అనువైన ఎర్రనేలలు, ఇసుకతో కూడిన తెల్ల దుబ్బ భూములు అధికంగా ఉన్నాయి. మొత్తం భూ విస్తీర్ణం 47,887 ఎకరాలు ఉంది. 17,178 మంది రైతులు ఉన్నారు. రెండేళ్లుగా ఎంజీకేఎల్ఐ సాగునీరు వస్తుండటంతో మండలంలో పంటల సాగు పెరిగింది. ఈ ఏడాది వానాకాలం పంటల సాగుపై రైతుల ఆసక్తి అంతగా కన్పించకపోయినా వ్యవసాయాధికారులు మాత్రం 25,500 ఎకరాల వరకు పత్తి, 6,750 ఎకరాల్లో వరి, 250 ఎకరాల్లో మొక్కజొన్న పంటలను సాగుచేయనున్నట్లు అంచనా వేస్తున్నారు.

రూ.22 కోట్ల పెట్టుబడి సాయం..

అచ్చంపేట నియోజకవర్గంలోనే ఉప్పునుంతల మండలానికి అత్యధికంగా గత యాసంగి పంటకుగాను రైతుబంధు పథకం ద్వారా 17,178 మంది రైతులకు రూ.22,73,83,000 పెట్టుబడి సాయం అందింది. ప్రస్తుత వానాకాలం పంటకు కూడా పెట్టుబడి సాయం అందుతుందనే ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు.

నాలుగు ఎకరాల్లో పత్తి



ఈ ఏడాది వానాకాలం పంటగా నాలుగు ఎకరాల్లో పత్తి పంటను సాగుచేయాలని అనుకుంటున్నాం. అందుకు పొలాన్ని సిద్ధం చేసుకొని పెట్టుకున్నాం. గతేడాది ఆరు ఎకరాల్లో పత్తి పంటను సాగుచేయగా.. 48 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మొక్కజొన్న పంటకు నీటి తడులు ఎక్కువగా అవసరం అవుతుండగా.. వర్షాలు సరిగా లేకుంటే నష్టపోవడం జరుగుతుందనే భయంతో రైతులు సాగుచేయడంలేదు. కేఎల్ఐ కాల్వ నీటి ఆధారంగా ఎక్కువగా యాసంగి వేరుశనగ పంటసాగుపై రైతులు శ్రద్ధ చూపుతున్నారు.

– గున్నమోని సైదులు, రైతు, కొత్తరాంనగర్, ఉప్పునుంతల

ఒకే పంటపై ఆధారపడొద్దు..



రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పత్తితో పాటు మొక్కజొన్న, కంది పంటలను సాగు చేసుకోవాలి. ప్రభుత్వం నుంచి ధ్రువీకరించబడిన కంపెనీలకు చెందిన నాణ్యతతో కూడిన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు విధిగా రసీదు పొందాలి. జూన్ రెండో వారం నుంచి సమృద్ధిగా వర్షాలు పడి భూమి చలువకు వచ్చిన తర్వాతనే విత్తనాలు వేసుకోవాలి. తొందరపడి విత్తనాలు వేసుకొని నష్టపోవద్దు. మొక్కజొన్న సాగుచేయని రైతులు నాలుగు నెలలకే పంట చేతికొచ్చే కంది పంటను సాగుచేసుకోవాలి.

– సునీత, మండల వ్యవసాయాధికారి, ఉప్పునుంతల